నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, ఆదివారం 28 జనవరి 2024 | NIZAMABAD

ఖాదర్ కోసం మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ కట్టించిన ఇల్లు ఇదే..

గంప గోవర్ధన్ దాతృత్వం

మాటిచ్చాడు.. ఇల్లు కట్టిచ్చాడు

దివ్యాంగుడికి మాజీ ఎమ్మెల్యే చేయూత

సొంత డబ్బులతో ఇల్లు కట్టించిన వైనం

నేడు గంప చేతుల మీదుగా గృహ ప్రవేశం

నిజామాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అతనో దివ్యాంగుడు. కదల్లేడు... ఏ పనీ చేసుకోలేని నిస్సహాయుడు. కామారెడ్డి శివారు పాత రాజంపేట గ్రామంలోని మెయిన్ రోడ్డు పక్కనే ఏండ్లుగా సొంత జాగలోనే గుడిసెలో నివాసం ఉంటున్నాడు. కామారెడ్డి – హైదరాబాద్ రాకపోకలకు ప్రధాన రహదారిగా ఉన్న ఈ ప్రాం తంలో కాలంతో సంబంధం లేకుండా దీనవస్థలో దినదినగండంగా జీవిసున్నాడు. దివ్యాంగుడు షేక్ ఖాదర్ పరిస్థితిని కండ్లారా చూసిన అప్పటి ప్రభుత్వ విప్, కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఎలాగైనా ఈ నిరుపేద వ్యక్తికి సహాయంగా నిలవాలని నిశ్చయించుకున్నాడు. ఓ రోజు పాత రాజంపేటలో పర్యటనకు వచ్చిన సమయంలో షేక్ ఖాదర్‌ను పలుకరించగా తన ఇబ్బందులు గ్రహించి ప్రస్తుతం గుడిసె స్థానంలోనే ఇల్లు కట్టిస్తానని మాటిచ్చాడు. సరిగ్గా ఎనిమిది నెలల క్రితం గంప గోవర్ధన్ ఇచ్చిన మాటకు కట్టుబడి షేక్ ఖాదర్‌కు సొంతింటిని నిర్మించాడు. ఇందులో ఖాదర్‌తోపాటు సోదరి సైతం ఉంటున్నారు. సొంత జాగాను వదిలి వెళ్లేందుకు ఇష్ట పడకపోవడంతో తన సొంత పైసలతోనే గంప గోవర్ధన్ ఇల్లు నిర్మించి ఇవ్వడంతో పాత రాజంపేట వాసులంతా హర్షం వ్యక్తంచేస్తున్నారు.

రూ.9లక్షల వ్యయం..

షేక్ ఖాదర్ కొత్తింటి నిర్మాణానికి రూ.9 లక్షలు వెచ్చించారు. ఈ మొత్తాన్ని గంప గోవర్ధనే భరించారు. 80 గజాల విస్తీర్ణంలో బాధిత దివ్యాంగుడికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా నిర్మాణాన్ని చేపట్టారు. హాలు, కిచెన్, ఒక చిన్నపాటి గదిని ఇందులో కల్పించారు. రంగు లు అద్దుకున్న కొత్త ఇల్లు వైభవోపేతంగా కనిపిస్తున్నది. ఏండ్లుగా గుడిసెను వదిలి వచ్చేందుకు ఇష్టపడని వ్యక్తి ఇన్నాళ్లకు సొంతింట్లోకి మకాం మార్చుతుండడం ఆనందంగా ఉందంటూ ప్రజలంతా చెబుతున్నారు. ఆదివారం ఉదయం షేక్ ఖాదర్ ఇంటి నిర్మాణ దాత గంప గోవర్ధన్‌ను చేతుల మీదుగా గృహ ప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గ్రామస్తులందరినీ ఈ కార్యక్రమానికి పిలుస్తున్నారు.

చాలా ఆనందంగా ఉంది...

రైల్వేగేట్ సమీపంలో వానలో తడుస్తూ, ఎండ, చలిని భరిస్తూ ఓ గుడిసెలో షేక్ ఖాదర్ నివాసం ఉండడాన్ని గమనించాను. దివ్యాంగుడైన ఖాదర్‌కు ఏదైనా సహాయం చేయాలని అనేక ప్రయత్నాలు చేశాను. కానీ ఖాదర్ తాను ఉంటున్న పూరిగుడిసెను వదిలి వెళ్లేందుకు అంగీకరించలేదు. తన ఇష్టపూర్వకంగానే రోడ్డు పక్కనే అదే 80గజాల విస్తీర్ణంలో ఇల్లు కట్టించి ఇచ్చాను. నాకు చాలా సంతృప్తిగా ఉన్నది.

- గంప గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే

కామారెడ్డి పట్టణంలో ధర్నా నిర్వహిస్తున్న దళితబంధు లబ్ధిదారులు, దళిత సంఘాలు ప్రతినిధులు

కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దళితబంధు లబ్ధిదారులు

కదిలిన దళిత దండు

దళితబంధు అమలుచేయాలని ఆందోళన

కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా

తరలివచ్చిన దళిత సంఘాలు, లబ్ధిదారులు

కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నిరసన ప్రదర్శన

ఎంపిక చేసిన వారికి యూనిట్లు ఇవ్వాలని వినతి

నిజామాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): దళితుల ఆర్థికాభ్యున్నతి కోసం గత కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకాన్ని అమలుచేయాలని కోరుతూ దళితులు కొన్నిరోజులుగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఈ పథకానికి ఎంపికైన వారందరికీ వెంటనే యూనిట్లు మంజూరుచేయాలని డి మాండ్ చేస్తూ ఇటీవల నిజామాబాద్ జిల్లాలో నిరసన కార్యక్రమాలు నిర్వహించగా.. తాజాగా కామారెడ్డి జిల్లాలో శనివారం ఆందోళన చేపట్టారు. కామారెడ్డి పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తాలో జిల్లాకు చెందిన దళిత సంఘాల ప్రతినిధులు, దళితబంధు పథకం లబ్ధిదారులు, ఆశావహులు వందలాది మంది తరలి వచ్చి ధర్నా చేశారు. అనంతరం ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని ఆందోళన నిర్వహించారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీతంగా తీసుకు వచ్చిన దళితబంధును రాజకీయ కోణంలో చూడడం సబబు కాదని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. తొలి విడుతలో మంజూరైన యూనిట్లకు ఇవ్వాల్సిన నిధులను మంజూరుచేయడంతోపాటు రెండో విడుతలో ఎంపిక చేసిన వారందరికీ యూనిట్లు అందించాలని డిమాండ్ చేశారు. ఖాతాల్లో జమ చేసిన డబ్బులను ఫ్రీజ్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సరికాదంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు.

నిలిచిపోయిన యూనిట్ల పంపిణీ

గత బీఆర్ఎస్ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టి పక్కాగా అమలు చేసింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రెండో విడుతలో భాగంగా యూనిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టగా ప్రభుత్వం మారింది. దీంతో పథకానికి ఎంపిక చేసిన లబ్ధిదారులకు యూనిట్ల పంపిణీ నిలిచిపోవడంతో వారంతా ఆందోళనలు చేస్తున్నారు. ఒక్కో యూనిట్ కింద లబ్ధిదారుడికి ఎలాంటి షరతులు లేకుండా నేరుగా రూ.10లక్షల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వమే అందిస్తున్నది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండో విడుతలో ఏకంగా 1100 యూనిట్లు మంజూరు చేయగా.. కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసింది. ఉమ్మడి జిల్లాలో 9900 యూనిట్లు మంజూరుకాగా.. వేలాది మంది దళిత కుటుంబాల్లో వెలుగులు పంచనున్న పథకాన్ని నిలిపేయడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

దళిత కుటుంబాల్లో ఆర్థిక ప్రగతి

దళితబంధు పథకం దళితులు వ్యాపారవేత్తలుగా ఎదిగి, స్వయం సమృద్ధి సాధించేందుకు బాటలు వేసింది. లబ్ధిదారుడి వాటా లేకుండా అమలవుతున్న పథకంగా దళితబంధు చరిత్రకెక్కింది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో నియోజకవర్గానికి 100 యూనిట్ల చొప్పున నిజామాబాద్‌లో 550, కామారెడ్డిలో 350 యూనిట్లు మంజూరయ్యాయి. వీటికి సంబంధించిన గ్రౌండింగ్ ప్రక్రియ దాదాపుగా పూర్తయ్యింది. లబ్ధిదారులకు యూనిట్ల పంపిణీ జోరుగా జరిగింది. వీరంతా తమ కాళ్లపై తాము నిలబడి దళితబంధు ద్వారా ప్రగతిని సాధిస్తున్నారు. మొన్నటి వరకు కూలీలుగా, ఆయా చోట్ల నెలవారీ జీతాలకు పనులు చేసిన వారే ఇప్పుడు యజమానులుగా పనులు చేసుకుంటున్నారు. రెండో విడుత పంపిణీపై కొత్త ప్రభుత్వం ఎటూ తేల్చకపోవడంతోపాటు మొదటి విడుతలో మంజూరైన పలు యూనిట్లకు నిధుల విడుదలకు బ్రేక్ వేసింది. ఖాతాల్లో జమ చేసిన నిధులను సైతం ఫ్రీజ్ చేయడంతో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

దళితబంధును రద్దు చేయొద్దు

దళితబంధు పథకాన్ని రద్దు చేయొద్దు. ఈ పథకం ద్వారా దళిత సమాజానికి ఎంతో మేలు జరుగుతుంది. అనేక పేద కుటుంబాలను ఆదుకునే ఈ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా కొనసాగించాలని కోరుతున్నాం. కేసీఆర్ తెచ్చిన ఈ పథకం యావత్ దళిత జాతికి ఎంతో ఉపయుక్తమవుతుంది.

- లక్ష్మణ్, భిక్కనూరు

నిధులిచ్చి ఆదుకోవాలి...

దళితబంధు పథకాన్ని కచ్చితంగా అమలు చేసి మా కుటుంబాలను ఆదుకోవాలి. గతంలో ఇలాంటి పథకాలను ఏ ప్రభుత్వమూ తీసుకురాలేదు. కేసీఆర్ ప్రభు త్వం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని కాంగ్రెస్ సర్కారు కొనసాగించాలని కోరుతున్నాం. ఇందులో రాజకీయాలను పక్కన పెట్టి నిధులు మంజూరుచేసి దళితులకు అండగా నిలవాలని విన్నవిస్తున్నాం.

- నారాయణ, కామారెడ్డి నియోజకవర్గం

అంగన్‌వాడీలను సందర్శించిన యూనిసెఫ్ బృందం

తిప్పారం అంగన్‌వాడీ కేంద్రం వద్ద యూనిసెఫ్ బృందం సభ్యులు

గాంధారి, జనవరి 27: మండలంలోని తిప్పారం తండా, గొల్లాడీ తండా, సోమారం తండాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను యూనిసెఫ్ బృందం శనివారం సందర్శించింది. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, ఏడు నెలల నుంచి రెండేండ్ల చిన్నారులకు అందిస్తున్న ఆహారంతోపాటు వారి అలవాట్లను అడిగి తెలుసుకున్నారు. తల్లులు, పిల్లల వ్యక్తిగత పరిశుభ్రతకు తీసుకుంటున్న జాగ్రత్తలను అడిగారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వారి వెంట ఎల్లారెడ్డి ప్రాజెక్టు అధికారిణి సరిత, యూనిసెఫ్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ త్రవేశ, భవాని, మాధురి,అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

బోధన్ దవాఖానలో 'కాయకల్ప'..

బోధన్ దవాఖాన ఆవరణను పరిశీలిస్తున్న అధికారుల బృందం

బోధన్, జనవరి 27: బోధన్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ దవాఖానను 'కాయకల్ప' వైద్యాధికారుల బృందం శనివారం పరిశీలించింది. దవాఖానలో నెలకొన్న పరిస్థితులు, పరిసరాలతోపాటు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆర్ఎంవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లా ప్రభుత్వ దవాఖానలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులు, రికార్డుల నిర్వహణ, అందుతున్న వైద్య సేవలను పరిశీలించామన్నారు. దవాఖాన భవనం పాతది కావడంతో కొంత ఇబ్బందికరంగా ఉన్నదని, మిగతా విషయాల్లో పరిస్థితులు మెరుగ్గానే ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. కాయకల్ప తరపున వచ్చిన గజ్వేల్ దవాఖాన వైద్యాధికారులు డాక్టర్ సాయికిరణ్, రాముతోపాటు స్థానిక ఆర్ఎంవో డాక్టర్ రహీం, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ తదితరులు ఉన్నారు.

దూరవిద్యలో డిగ్రీ, పీజీ ప్రవేశాలకు ఆహ్వానం

ఖిలీల్‌వాడి, జనవరి 27 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ప్రొఫెసర్ రాంరెడ్డి దూర విద్య కేంద్రంలో 2023–24 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు రెండో విడుత అవకాశం కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్నవారు మార్చి 31లోగా వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు అధ్యయన కేంద్ర సమన్వయకర్త డాక్టర్ బోయినపల్లి ప్రభాకర్ (94909 01050)ను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఉమ్మడి జిల్లాలో 24మంది సీఐల బదిలీ

మల్టీజోన్ ఐజీ డాక్టర్ తరుణ్ జోషి ఉత్తర్వులు

వినాయక్‌నగర్,జనవరి 27: రాష్ట్రంలోని మల్టీజోన్ పరిధిలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఐజీ డాక్టర్ తరుణ్ జోషి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి నిజామాబాద్,కామారెడ్డి పరిధిలో 24మంది సీఐలను బదిలీ చేశారు. బదిలీ అయిన సంబంధిత సీఐలను వెంటనే రిలీవ్ చేయాలని నిజామాబాద్, కామారెడ్డి, సిద్దిపేట్, నిర్మల్ జిల్లాల పోలీస్ అధికారులకు సూచించారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
జగడం నరేశ్	సిద్దిపేట్ టాస్క్‌ఫోర్స్	బిచ్కుంద
కృష్ణ	బిచ్కుంద	ఐజీ కార్యాలయం
సంతోష్ కుమార్	కామారెడ్డి ఎస్‌బీ	సదాశివనగర్
రామన్	సదాశివనగర్	ఐజీ కార్యాలయం
రవీందర్ నాయక్	నిర్మల్ ఎస్‌బీ	ఎల్లారెడ్డి
శ్రీనివాస్	ఎల్లారెడ్డి	ఐజీ కార్యాలయం
చందర్ రాథోడ్	నిజామాబాద్ ట్రాఫిక్	నిజామాబాద్ ఎస్‌బీ
శ్రీనివాస్	నిజామాబాద్ ఎస్‌బీ	ఐజీ కార్యాలయం
ఏ.వెంకటేశ్వర్లు	ఐజీ కార్యాలయం	నిజామాబాద్ ఎస్‌బీ
కె.ముత్యాలు	నిజామాబాద్ ఎస్‌బీ	ఐజీ కార్యాలయం
రవికుమార్	సిద్దిపేట ఎస్‌హెచ్‌వో	ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో
సురేశ్‌బాబు	ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో	ఐజీ కార్యాలయం
సురేందర్	సిద్దిపేట ఎస్‌బీ	ధర్పల్లి
మల్లేశ్	నిర్మల్ సీసీఎస్	డిచ్‌పల్లి
కృష్ణ	డిచ్‌పల్లి	ఐజీ కార్యాలయం
ప్రేమ్‌కుమార్	బోధన్ ఎస్‌హెచ్‌వో	నిజామాబాద్ సీసీఎస్
వీరయ్య	నిజామాబాద్ సీసీఎస్	బోధన్ ఎస్‌హెచ్‌వో
శ్రీనివాస్‌రాజు	బోధన్ రూరల్	నిజామాబాద్ సీసీఆర్‌బీ
కోల నరేశ్	జైనథ్ రూరల్	బోధన్ రూరల్
మనోజ్‌కుమార్	నిజామాబాద్ సీసీఆర్‌బీ	ఐజీ కార్యాలయం
శ్రీధర్‌రెడ్డి	కామారెడ్డి డీసీఆర్‌బీ	ఆర్మూర్ రూరల్
గోవర్ధన్ రెడ్డి	ఆర్మూర్ రూరల్	ఐజీ కార్యాలయం
సురేందర్ రెడ్డి	నిజామాబాద్ సీసీఎస్	ఐజీ కార్యాలయం
వెంకటయ్య	నిజామాబాద్ పీసీఆర్	ఐజీ కార్యాలయం

రోడ్డు విస్తరణ కోసం.. సొంతిల్లు కూల్చివేత

ఇంటిని కూల్చివేస్తున్న పొక్లెయిన్, పక్కన కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన కామారెడ్డి ఎమ్మెల్యే

అధికారుల సమక్షంలో తొలగింపు పనులు

గతంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నా: కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి, జనవరి 27: రోడ్డు విస్తరణ కోసం అవసరం మేరకు తన ఇంటినే కూల్చివేయించారు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి. అధికారుల సమక్షంలో శనివారం స్వచ్ఛందగా కూల్చివేత పనులను ప్రారంభించారు. కామారెడ్డి పాత బస్టాండ్ నుంచి అడ్లూర్ వైపు వెళ్లే మార్గంలో ఎమ్మెల్యే కుటుంబానికి దశాబ్దాల క్రితం నిర్మించిన ఓ ఇల్లు ఉన్నది. గతంలో ఈ రోడ్డును మాస్టర్‌ప్లాన్‌లో 80 ఫీట్లుగా చూపగా.. వాస్తవానికి 30 నుంచి 40 ఫీట్ల వరకు మాత్రమే ఉన్నది ఈ మార్గంలో రద్దీ పెరగడంతోపాటు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో రోడ్డు విస్తరణకు తన ఇల్లు అడ్డుగా ఉందని భావించిన ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి కూల్చివేత నిర్ణయం తీసుకొని ఆర్అండ్‌బీ, మున్సిపల్ టౌన్‌ప్లానింగ్, ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు విస్తరణ కోసం తన ఇంటిని కూల్చి వేసుకుంటున్నట్లు తెలిపారు. రోడ్డు విస్తరణ కోసం అడ్డుగా ఉన్న నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని పట్టణ ప్రజలకు ఆయన సూచించారు. కామారెడ్డి అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తానని, తాను ఎవరికీ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు.

మహిళలకు స్వీయ రక్షణ ఎంతో అవసరం

మాట్లాడుతున్న నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల

వినాయక్‌నగర్, జనవరి 27: నేటి సామాజిక పరిస్థితుల్లో మహిళలు, విద్యార్థినులు, యువతులు ప్రతి ఒక్కరికీ స్వీయ రక్షణ ఎంతో అవసరమని నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి , జిల్లా న్యాయసేవా అధికార సంస్థ చైర్‌పర్సన్ సునీత కుం చాల అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆత్మరక్షణపై న్యాయ విజ్ఞాన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాలికలకు 30 రోజుల పాటు తైక్వాండోలో శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. వారి భవిష్యత్తు వారిపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఎవరైనా దురుసుగా ప్రవర్తించిన సమయంలో తమను తాము రక్షించుకోవడానికి మార్షల్ ఆర్ట్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

బాలికలకు రక్షణగా వ్యవస్థలు

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

బాలిక ప్రగతి, రక్షణ, పురోభివృద్ధికి న్యాయ, పోలీసు, కార్యనిర్వాహక వ్యవస్థలు పని చేస్తున్నాయని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. మహిళలపై అఘాయిత్యాలను నిర్మూలించడంలో ఆత్మరక్షణ అనేది క్రియాశీలకంగా ఉంటుందన్నారు. తన కూతురుకు సైతం తైక్వాండో శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు.

ఆత్మరక్షణ.. పదునైన ఆయుధం

సీపీ కల్మేశ్వర్

ఆత్మరక్షణ అనేది పాఠశాల, కళాశాల స్థాయిలోనే కాకుండా ప్రమాదకరమైన వ్యక్తుల నుంచి కాపాడుకునేందుకు పనికి వచ్చే పదునైన పనిముట్టు అని సీపీ కల్మేశ్వర్ అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, ట్రైనీ ఐపీఎస్ చైతన్య రెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్ , టీఎస్ బార్ కౌన్సిల్ సభ్యుడు రాజేందర్ రెడ్డి, అదనపు డీసీపీ జయ్‌రాం, అదనపు జిల్లా జడ్జి ఆశాలత, సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ బాబు, జూనియర్ సివిల్ జడ్జిలు గోపికృష్ణ, కుష్బు,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవదాసు పాల్గొన్నారు. తైక్వాండో శిక్షకుడు మనోజ్ కుమార్‌ను ఈ సందర్భంగా అధికారులు అభినందించారు.